Email : telanganaveenaofficial@gmail.com
Title Code : 12280
# తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
స్పాట్ ఎడిషన్
epaper.telanganaveena.com హైదరాబాద్ బుధవారం అక్టోబర్16, 2024

# బీజేపీపై అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు



తెలంగాణ వీణ, జాతీయం : జైల్లో ఉన్నప్పుడు తనకు ఇన్సులిన్ ఇవ్వకుండా చంపేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థలు కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడం తెలిసిందే. దీంతో ఆయన కొన్ని నెలల పాటు తీహార్ జైల్లో ఉన్నారు. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై బయట ఉన్నారు. తాజాగా, ఆయన మాట్లాడుతూ... తనకు మధుమేహం లెవల్స్ పెరిగాయని, దీంతో తాను రోజూ నాలుగు ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకుంటానని వెల్లడించారు. జైల్లో ఉన్న తాను ఇన్సులిన్ తీసుకోకపోతే కిడ్నీలు ఫెయిలై చనిపోయేలా వాళ్లు కుట్రలు పన్నారని బీజేపీని ఉద్దేశించి అన్నారు. కానీ ఢిల్లీ ప్రజల ఆశీస్సులతో బయటకు వచ్చానన్నారు. గత పదేళ్ల కాలంలో ఎల్జీని అడ్డుపెట్టుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కానీ వారి ప్రయత్నాలను తాము తిప్పికొట్టామన్నారు. పంజాబ్‌లో తమ గెలుపు తర్వాత... ఢిల్లీలో తమను ఆపకపోతే దేశవ్యాప్తంగా ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వస్తుందని వారు భయపడుతున్నారన్నారు. తాను జైల్లో ఉండగా ఢిల్లీ అభివృద్ధి పనులను ఆపేశారని, తాను జైలు నుంచి విడుదలయ్యాక వాటిని తమ ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందన్నారు.


# రేవంత్ రెడ్డి పంపే బుల్డోజర్లకు అడ్డంగా నిలబడతాం: కేటీఆర్

* మూసి పేరిటజరుగుతున్న మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళతాం..
* బిల్డర్లు, వ్యాపారవేత్తలను బెదిరించేందుకే హైడ్రాను తీసుకొచ్చారు..



తెలంగాణ వీణ, హైదరాబాద్ : హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి పంపే బుల్డోజర్లకు తాము అడ్డంగా నిలబడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కూకట్‌పల్లిలో 1980లో కాంగ్రెస్ ప్రభుత్వమే 20 వేల మందికి పట్టాలు ఇచ్చిందని వెల్లడించారు. ఏళ్లుగా నివసిస్తున్న పేదలకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో పర్యటించి మురుగు నీటి శుద్ధి కేంద్రాల పనులను పరిశీలిస్తామన్నారు.హైడ్రా వసూళ్లతోనే నాంపల్లిలో కాంగ్రెస్, మజ్లిస్ నేతల మధ్య గొడవ జరిగిందన్నారు. తాము బస్తీల్లోకి వెళ్లి పార్టీ లీగల్ సెల్ ద్వారా బాధితులకు అండగా ఉంటామన్నారు. మూసీ విషయంలో ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడుతోందని విమర్శించారు. మూసీ పరీవాహక పరిధిలోని పేదల ఇళ్లు కూలుస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బిల్డర్లు, వ్యాపారవేత్తలను బెదిరింపులకు గురి చేసేందుకే హైడ్రాను తీసుకువచ్చారని ఆరోపించారు.మూసీ పేరుతో జరుగుతున్న దోపిడీని ప్రజల్లోకి తీసుకువెళతామన్నారు. మూసీ నది పరీవాహక ప్రజలకు యాభై ఏళ్ల క్రితం ప్రభుత్వమే పట్టాలను ఇచ్చి, రిజిస్ట్రేషన్లు చేసిందన్నారు. ఇన్నాళ్లూ వారి చేత నల్లా బిల్లు, కరెంట్ బిల్లు కట్టించుకుందని తెలిపారు. ఇప్పుడు వచ్చి కనీసం నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను కూలుస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లాలో రాడార్ స్టేషన్ ఏర్పాటుతో ఒక్క ఉద్యోగమూ రాదన్నారు. పర్యావరణానికి నష్టం కలిగించే ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడమేమిటని మండిపడ్డారు.

# ఐఏఎస్‌లకు షాక్ ఇచ్చిన హైకోర్టు..



తెలంగాణ వీణ, హైదరాబాద్ : తెలంగాణ హైకోర్టులో ఐఏఎస్‌లకు ఊరట దక్కలేదు. క్యాట్ ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇవ్వాలని వారు వేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. క్యాట్ ఆదేశాల ప్రకారం వారు అక్టోబర్ 16వ తేదీన వారికి కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చెయ్యాల్సి ఉంటుంది. కానీ ఐఏఎస్‌లు.. క్యాట్ ఆదేశాలపై కోర్టులో తేల్చుకునేందుకు హైకోర్టులో పిటిషన్లు వేశారు. కానీ.. హైకోర్టు విచారించేందుకు ఆసక్తి చూపలేదు. అసలు ఈ విషయంలో తాము జోక్యం చేసుకోవడం సరికాదని హైకోర్టు తెలిపింది. అంతేకాదు.. స్టే ఇస్తే, ఇక ఈ అంశం ఎప్పటికీ తేలదనీ, స్టేలతోనే కాలం గడుస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది.ఐఏఎస్‌లు ఉన్నది ప్రజాసేవకోసమే అన్న హైకోర్టు.. క్యాడ్ ఎక్కడికి ఆర్డర్ ఇస్తే.. అక్కడికి వెళ్లాలని తెలిపింది. ఏపీలో ప్రజలు వరదలతో బాధపడుతుంటే, వారికి సేవ చెయ్యాలని మీకు లేదా అని హైకోర్టు ప్రశ్నించింది. ఐఏఎస్‌ల బాధ్యతను హైకోర్టు గుర్తు చేసింది. తెలంగాణలోనే ఉంటామనడం సరికాదన్న హైకోర్టు.. అసలు రిపోర్ట్ చెయ్యకుండా విచారణ చెయ్యమనడం సరికాదని తెలిపింది. ముందు రిపోర్ట్ చెయ్యాలని సూచించింది.ఇప్పుడు ఐఏఎస్‌లు రిపోర్ట్ చెయ్యాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇక వారు తెలంగాణ నుంచి రిలీవ్ కావాల్సి ఉంటుంది. లేదంటే వారు మళ్లీ న్యాయపోరాటం చెయ్యాల్సి ఉంటుంది. ఐతే.. రిపోర్ట్ చెయ్యడానికి అక్టోబర్ 16 సాయంత్రం 5 గంటల వరకే టైమ్ ఉంది కాబట్టి.. ఐఏఎస్‌లు ఏపీకి వెళ్లక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

# రైతుకు కేంద్ర ప్రభుత్వం భారీ శుభవార్త..



తెలంగాణ వీణ, జాతీయం : మోడీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక ప్రకటనలు చేశారు. ఒకవైపు కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు కానుకగా ఇస్తూనే మరోవైపు రైతులకు కూడా ప్రభుత్వం భారీ దీపావళి కానుకగా ఇచ్చింది. వాస్తవానికి రబీ సీజన్‌లో పంటల కనీస మద్దతు ధరని కేంద్రం పెంచింది. ఇందులో గోధుమ పంటకు క్వింటాల్‌కు రూ.150, ఆవాల పంటపై క్వింటాల్‌కు రూ.300 చొప్పున పెంచారు.

# నారా బ్రాహ్మణి క్లాప్‌తో బాలకృష్ణ 'అఖండ-2: తాండవం' ప్రారంభం




తెలంగాణ వీణ, సినిమా : నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కలయికలో వచ్చిన ఇప్పటి వరకు వచ్చిన సింహా, లెజెండ్, అఖండ చిత్రాలు భారీ విజయాలను అందుకున్నాయి. తాజాగా ఈ ఎవర్‌గ్రీన్ కలయికలో రూపొందుతున్న నాలుగో చిత్రం 'అఖండ-2: తాండవం' చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అఖండ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కనున్న చిత్రమిది. ఈ చిత్రం పూజా కార్యక్రమాల్లో చిత్ర యూనిట్‌తో పాటు బాలకృష్ణ కుమార్తెలు నారా బ్రాహ్మణి, తేజస్విని ఇతర ఫ్యామిలీ మెంబర్స్ కూడా పాల్గొన్నారు. బాలకృష్ణపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నారా బ్రాహ్మణి క్లాప్ కొట్టారు. తమన్ స్వరాలు అందిస్తున్న ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలుస్తాయి.